
ప్రజాశక్తి
గురువారం 5 మే 2025



నగరంలో భారీ వర్షం


ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో నగరంలో పోలీస్ బ్యారెక్స్ రోడ్డుకు ఇరువైపులా, కలెక్టరేట్ వద్ద, బాలాజీ జంక్షన్‌కి వెళ్లే మార్గంలో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగింది. ఆర్అండ్‌బి రైతుబజారు వద్ద ఫ్లెక్సీ నేలకొరిగింది. నగర పాలక సిబ్బంది చెట్లు, విరిగిన కొమ్మలను తొలగించారు. భారీగా వర్షం కురవడంతో కాలువలో వెళ్లాల్సిన నీరు రోడ్డుపైకి చేరింది. ప్రధానంగా గంటస్తంభం ప్రాంతంలో ఫుట్ పాత్ వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతమైన పద్మావతినగర్ రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మద్యం డోర్ డెలివరీ

మద్యం ఉల్లం'ఘనులు' ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. నిబంధనలకు నిలువునా పాతరేసి ఇష్టారాజ్యం చెలాయిస్తున్నారు. బెల్టుషాపులను కట్టడి చేస్తే వ్యాపారం చేయలేమని ఇప్పటివరకు సన్నాయి నొక్కులు నొక్కిన లైసెన్సీలు.. ఏకంగా ఆ బెల్టుషాపులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. సరఫరా చేసే మద్యం సీసాలపై అదనపు ధర వడ్డించి మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏమీ జరగనట్టు సంబంధిత యంత్రాంగం చోద్యం చూస్తోంది. మామూళ్ల మత్తులో ఊగి, జోగుతున్నారు. అక్రమాలు కళ్లెదుట కనిపిస్తున్నా, కళ్లు బైర్లు కమ్మినట్లు వ్యవహరిస్తున్నారు. వీరి తీరును ప్రజలు, మందుబాబులు ఛీదరించుకున్నా.. 'నవ్విపోదురు గాక మాకేంటి సిగ్గు' అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.



- బెల్టుషాపులతో వైన్‌షాపుల యజమానుల కుమ్మక్కు
- అడుగడుగునా మద్యం ఉల్లంఘనలు
- అదనపు ధరలతో మందుబాబులపై బాదుడే బాదుడు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి- మెంటాడ

జిల్లాలో పలు గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. లైసెన్స్‌షాపుల నుంచి బెల్టుషాపులకు మద్యం డోర్ డెలివరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ప్రభుత్వం పదేపదే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశిస్తోంది. అదనపు ధరకు అమ్మినా, బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసినా, గొలుసు దుకాణాలు నిర్వహించినా కఠినంగా వ్యవహరించాలని చెబుతోంది. మద్యం ఉల్లంఘనలకు పాల్పడే షాపులకు మొదటిసారి రూ.5 లక్షల జరిమానా విధించాలని, రెండోసారి పట్టుబడితే దానికి సరఫరా చేసే లైసెన్సు షాపును రద్దుచేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం నూతన పాలసీలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. కానీ జిల్లాలో ఏ ఒక్కటీ అమలుకు నోచడం లేదు. ఎక్కడికక్కడ గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. టీ దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ.. మద్యం దొరకని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. మారుమూల గ్రామాలు, గిరిశిఖర ప్రాంతాల్లో సైతం మద్యం విచ్చలవిడిగా 24 గంటలూ దొరుకుతోంది. బెల్టుషాపుల నిర్వహణ సెల్ఫ్ ఎంప్లాయిమెంటులా మారిపోయింది. అధికారుల అరకొర దాడులు ఎటువంటి ఫలితాన్నీ ఇవ్వడం లేదు.

అదనపు బాదుడు

ఇప్పటివరకు బెల్టుషాపులకు ఎంఆర్‌పికి మద్యం సరఫరా చేసే షాపుల యజమానులు.. మద్యం బ్రాండు, పరిమాణం బట్టి సీసాపై 10 నుంచి 20 రూపాయల వరకు వైన్‌షాప్‌ల వద్ద అదనపు ధరకు అమ్ముతున్నారు. డోర్ డెలివరీ చేస్తే ఇంకో పది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్ట్ నిర్వాహకులు సీసాపై రూ.50 నుంచి 70 వరకు అక్కడ పరిస్థితులు బట్టి అమ్ముతున్నారు. ఇదేంటని అడిగితే, రిస్కుతో కూడుకున్నందున తప్పడం లేదని చెప్పుకొస్తున్నారు. లాభాల రుచిమరిగిన బెల్టు నిర్వాహకులు ఆ భారాన్ని మందుబాబులపై మోపుతున్నారు. బెల్టుషాపుల్లో ఇప్పటికే అదనపు ధర చెల్లిస్తున్న మద్యం ప్రియులు.. గత్యంతరం లేక ఈ భారాన్ని కూడా మోయక తప్పడం లేదు. ఇలా మద్యం షాపుల యజమానులు, బెల్టు నిర్వాహకులు కలసి మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

లైసెన్సీల నయా అవతారమేంటంటే..

లైసెన్స్‌షాపుల యజమానులు తమ వ్యాపారాన్ని పెంచుకోడానికి ఇప్పటివరకు కొన్ని బెల్టుషాపులకు డోర్ డెలివరీ చేస్తుండగా, తాజాగా బెల్టుషాపులకు వేలంపాట జరిగిన గ్రామాలకు కూడా విస్తరించారు. వేలం పాటలకు అధికార యంత్రాంగం నో చెబుతుండటంతో చాలాచోట్ల గోప్యంగా ఈ పాట జరిగిపోయింది. ఐతే, ప్రతిరోజూ మద్యం సీసాల కోసం వెళ్తే వ్యవహారం బయట పడుతుందని భావించి మద్యం షాపుల యజమానులు, వేలం పాటదారులు పరస్పర అవగాహనకు వచ్చారు. ఇందులో భాగంగా షాపుల యజమానులు ఆయా గ్రామాలకు గుట్టుగా మద్యాన్ని డోర్ డెలివరీ చేయిస్తున్నారు.

దృష్టి పెట్టని అధికారులు

ప్రభుత్వ ఆదేశాలతో తమకు పనిలేదన్నట్టుగా బహిరంగంగా ఇంతగా బరితెగించి వ్యవహరిస్తుంటే సంబంధిత అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడంలో మతలబు ఏమై ఉంటుందనే చర్చ జరుగుతోంది. చాలా గ్రామాల్లో వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పరస్పర ఒప్పందంతో ఒక్కటై బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. ఇదంతా గ్రామాభివృద్ధికని, గుడి నిర్మాణానికని సెంట్ మెంట్‌ను తెరపైకి తెస్తున్నారు. ఇవన్నీ తెలిసిన అధికారులు బెల్టుషాపులపై అడపాదడపా దాడులతో తమ బాధ్యత తీరిపోయిందన్నట్టుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

డోర్ డెలివరీతో నూతన పాలసీ

అటు గొలుసు దుకాణాలు, ఇటు అదనపు ధరలు, వేలంపాటలు, డోర్ డెలివరీలతో నూతన ఎక్సైజ్ పాలసీ అమలు ప్రహసనంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించకపోతే, అపహాస్యం పాలయ్యే ప్రమాదం లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బెల్టు షాపులకు లైసెన్సీ షాపులు నేరుగా మద్యం డోర్ డెలివరీ చేయడం ఇదే ప్రథమం. గతంలో గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించే వారు గుట్టుచప్పుడు కాకుండా లైసెన్స్ షాపునకు వెళ్లి మద్యం తెచ్చుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా అదనంగా డబ్బులు వసూలు చేసుకుని లైసెన్సీ షాపుల యజమానులే బెల్టుషాపులకు మద్యాన్ని నేరుగా డోర్‌డెలివరీ చేసి సొమ్ముచేసుకుంటున్నారు.



ర్యాలీ చేపడుతున్న వైసిపి శ్రేణులు

రాష్ట్రంలో దగా పాలన

'వెన్నుపోటు దినం'లో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలో మాయ, దగా, మోసంతో కూడిన పాలన సాగుతోందని శాసన మండలి ప్రతిపక్ష నేత, వైసిపి నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చీపురుపల్లిలో వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా చీపురుపల్లి కొత్త పెట్రోల్ బంక్ నుంచి సుమారు కిలోమీటరున్నర మేర నిర్వహించిన భారీ ర్యాలీలో బొత్స పాల్గొన్నారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరు చెప్పి ప్రజలను మోసం చేసి, గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఏడాది కాలంలో ప్రజలకు సిఎం చంద్రబాబు నాయుడు గానీ, కూటమి ప్రభుత్వం గానీ చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలు గమనించాలని బొత్స ప్రజలను కోరారు. వెన్నుపోటు అనేది చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్యని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు. మండల అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, పొట్నూరు సన్యాసినాయుడు, ఎస్‌వి రమణరాజు, కెవిఎస్‌ఎన్ సూర్యనారాయణరాజు, బూర్లె నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నేత బొత్స

ఒక్కసారిగా కుప్పకూలిన నేత

చీపురుపల్లిలో సభలో ప్రసంగిస్తుండగా వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక నాయకులు వెంటనే ఆయన్ను కారులో బొత్స క్యాంపు కార్యాలయానికి తరలించారు. స్థానిక వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం విశాఖపట్నం తరలించారు. మండుటెండలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న బొత్స వడదెబ్బ తగిలి, అస్వస్థతకు గురైనట్లు స్థానిక నాయకులు చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

6 నుంచి డిఎస్‌సి పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- హాల్ టిక్కెట్‌లో తప్పులుంటే సరిదిద్దుతాం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యే మెగా డిఎస్‌సి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. డిఎస్‌సికి చేయాల్సిన ఏర్పాట్లపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు డిఎస్‌సి పరీక్ష జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. దీనికోసం సుమారు 36,495 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐయాన్ డిజిటల్, సీతం, లెండి, ఎంవిజిఆర్, అవంతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్తు సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్‌టిసికి సూచించారు.

తప్పులు సరిదిద్దుకొనే అవకాశం ఉంది

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకొనే అవకాశం ఉందని, వాటి కోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సూచించారు. ఏదైతే తప్పు నమోదైందో, అందుకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్‌ను చూపించి, ధృవీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రం వద్దే సరిచేసుకోవచ్చని చెప్పారు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ మురళి, జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, ఎపి ఇపిడిసిఎల్ ఎస్‌ఇ లక్ష్మణరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ రాణి, జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ, సిఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

21న 6 వేల ప్రదేశాల్లో యోగాసనాలు

14న ఆయా ప్రదేశాల్లో సన్నాహక యోగా ప్రదర్శనలు : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆరు వేల ప్రాంతాల్లో యోగాసనాల ప్రదర్శన నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర జిల్లా సమన్వయ అధికారి ఎస్.సేతు మాధవన్ చెప్పారు. బుధవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో జెసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులంతా తమ గ్రామాలు, వార్డుల పరిధిలో ఒక్కో ఉద్యోగి ఒక్కో ప్రాంతంలో యోగాసనాల ప్రదర్శన ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనికి సన్నాహకంగా ఈ ప్రాంతాల్లో ఈ నెల 14న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే శనివారం జిల్లాలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో యోగాంధ్రపై పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించి, ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు.

జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు యోగాంధ్ర సిటిజన్ యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. యోగాసనాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణను మూడు నుంచి ఐదు రోజులకు పొడిగించినట్లు తెలిపారు.

స్థల పరిశీలన

గంట్యాడ, శృంగవరపుకోట : యోగాంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమం కోసం శృంగవరపుకోట, గంట్యాడ మండలాల్లో పలు ప్రదేశాలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పరిశీలించారు. ఈ నెల 10న సుమారు 5 వేల మంది ఉపాధి వేతనదారులతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం శృంగవరపుకోటలో జరగనుంది. ఈ కార్యక్రమం కోసం పలు ప్రదేశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రముఖ పర్యాటక ప్రదేశం తాటిపూడి వద్ద ఈ నెల 19న యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికోసం కూడా తాటిపూడి ప్రాంతాన్ని పరిశీలించారు. జెసి వెంట డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, శృంగవరపుకోట తహశీల్దార్ అరుణకుమారి, గంట్యాడ ఇన్‌ఛార్జి తహశీల్దార్ వివివి మూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.



రేషన్ షాపు తనిఖీ

తాటిపూటి రేషన్ షాపును జెసి సేతు మాధవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో సరుకుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సకాలంలో సరుకులను అందించాలని, షాపులకు రాలేని వారి ఇళ్ల వద్దకే సరఫరా చేయాలని జెసి ఆదేశించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

విజయనగరం టౌన్ : మానసిక ఒత్తిడిని తగ్గించే ఉల్లాసంగా ఉంచే చక్కటి ప్రక్రియ యోగా అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద యోగాసనాలు ప్రదర్శించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరితో యోగాసనాలు వేయించారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగాంధ్ర పోటీలు

రాజీవ్‌స్టేడియంలో యోగాంధ్ర-2025 అర్బన్ స్థాయి మూడో రోజు పోటీలను సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ప్రారంభించారు. గ్రూపు యోగా, యోగా పాటలు, యోగా చిత్రలేఖనం, యోగా స్కిట్ ప్లేయింగ్ సంబంధించి పోటీలు నిర్వహించారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- జిల్లాలో 4 లక్షల మొక్కలు నాటేందుకు శ్రీకారం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వన మహోత్సవ కార్యక్రమాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నట్టు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అటవీ శాఖ వద్ద 33 నర్సరీల్లో 20 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు అవసరమైన మొక్కలను అటవీశాఖ నుంచి పొందవచ్చని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులో డిఆర్‌ఒ మురళి, జిల్లా అటవీ అధికారి కొండలరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

నేడు నగరంలో..

విజయనగరంటౌన్ : నగరంలో 12 వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. నగరంలో ఫూల్‌బాగ్ కాలనీ సమీపంలోని నగరపాలక సంస్థ పార్కులో గురువారం నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేద్కర్ హాజరుకానున్నట్లు చెప్పారు.

భారీగా పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బొండపల్లి మండలం గొట్లాం నుంచి గజపతినగరం మధ్య బుధవారం ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. గొట్లాం నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా, అందులో 21 బస్తాల్లో వెయ్యి కిలోల బియ్యం పట్టుబడ్డాయి. దాసరి శ్రీను సహాయంతో ఆటో డ్రైవర్ గేదల ఈశ్వరరావు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో వీరు గజపతినగరంలో ఉప్పు, లైన్ వ్యాపారం చేస్తున్న ముప్పిడి గణేష్.. పిడిఎస్ బియ్యాన్ని గజపతినగరం, బొండపల్లి మండలాల్లో రేషన్‌కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తూ, గజపతినగరంలో టిఫిన్ షాపులు, బేకరీలకు విక్రయిస్తున్నట్లు తేలింది. అనంతరం 21 బస్తాల పిడిఎస్ బియ్యం, ఆటోను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని, సిఎస్ డిటికి అప్పగించారు. ముప్పిడి గణేష్, గేదల ఈశ్వరరావు, దాసరి శ్రీనుపై కేసులు నమోదు చేయాలని సూచించారు.

వసాదిలో 16 క్వింటాళ్లు

గంట్యాడ : పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గంట్యాడ మండలం వసాది గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ఉన్న సుమారు 1600 కిలోల పిడిఎస్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్, క్లీనర్ల పై కేసు నమోదు చేసినట్లు గంట్యాడ ఇన్‌ఛార్జి ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు. ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ముమ్మిడిశెట్టి నూకరాజుకు సంబంధించిన పిడిఎస్ బియ్యం వాహనంలో తరలిస్తుండగా, పట్టుకున్నట్లు చెప్పారు.



రేషన్ బియ్యంతో పట్టుబడిన ఆటో వద్ద విజిలెన్స్ అధికారులు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన జ్యూట్ సంచుల పంపిణీని కలెక్టర్ బుధవారం ప్రారంభిచారు. ప్లాస్టిక్ సంచులు బదులుగా గుడ్డ సంచులు, జ్యూట్ సంచులను వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మురళి, పర్యావరణ ఇంజినీర్ సరిత, జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

6న నగరంలో విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 6న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ అర్బన్ ఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు పనుల కారణంగా బ్యాంకు కాలనీ, శ్రీరామ్ నగర్, గోపాల్ నగర్, ఇందిరానగర్, రైల్వే స్టేషన్, సెంట్రల్ బ్యాంకు, బొత్స పేట, తిరుమల హాస్పిటల్, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ నగర్, నాయుడు కాలనీ, సాయి నగర్, సిద్ధార్థ నగర్, నరసింహ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజలను అవమానించిన వైసిపి

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వైసిపి వెన్నుపోటు దినం పేరుతో కార్యక్రమం పెట్టి ప్రజలను అవమాన పరిచిందని విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. బుధవారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్‌పి ల్యాండ్ నిధులను అన్ని నియోజకవర్గాలకు సమానంగా పంచుతున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డిజిటల్ క్లాస్ రూమ్, రీడింగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి నిధులు అడిగామని చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలి నాయుడు, బిసి సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ కాలనీలో మౌలిక సదుపాయాలు

నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరువలో ఉన్న జర్నలిస్ట్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్‌పి కలిశెట్టి హామీనిచ్చారు. అశోక్ బంగ్లాలో నగరానికి చెందిన పలువురు జర్నలిస్టులు ఆయన్ను కలిసి, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు బూరాడ శ్రీనివాసరావు, ప్రతినిధులు బి.నాగేంద్రప్రసాద్, కె.శేఖర్, మహాపాత్రో, ఎం.ఎం.ఎల్.నాయుడు, రమేష్ నాయుడు, గౌరీశంకరరావు, దుర్గాప్రసాద్ , జి.వి.ఎస్.ఆర్ .మూర్తి, శర్మ, రవిచంద్రశేఖర్, గురుప్రసాద్, కామేశ్వరరావు, శివాజి, చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఇంటి వద్దకే సరుకులు అందించాలని నిరసన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగు పూడి పంచాయతీ పరిధిలోని ఎస్.కోట సీతారాంపురం, బంగారయ్య పేట, చిట్టి వానిపాలెం గ్రామాల గిరిజనులు కెజీపూడిలో బుధవారం నిరసన తెలిపారు. తమ ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకుల అందించాలని తమ గ్రామాల నుంచి కెజెపూడి రావాలంటే కనీసం 3కిలోమీటర్లు నడిచి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రేషన్ సరుకులు తీసుకోవడానికి రావాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని, తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం మాదిరిగా తమ ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈనెల సరుకులు తీసుకుని డిపో వద్ద జూలాల ముత్యాలమ్మ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గిరిజన నిరసన తెలిపారు.

విజయ్‌కుమార్‌కి అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ ఎంఇఒ విజయ్‌కుమార్‌కి జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శిల్లంపల్లి రామారావు అభినందనలు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రిటైర్డ్ ఎంఇఒ ఈపు విజయ కుమార్ అవయవ దానానికి అంగీకరించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా విజయ కుమార్ మాస్టర్ మెడికల్ కళాశాలకు తన దేహాన్ని కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇవ్వడానికి సిద్ధపడడం గొప్ప విషయమన్నారు. ఆయన గతంలో అక్షర విజయం కార్యక్రమంలో చొరవ చూపించి విజయవంతం చేసి ఎంతో మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని, ఒక పక్క ఉపాధ్యాయ వృత్తి, మరోపక్క కళా రంగం సేవలు చేస్తూనే అవయవ దానం చేయడానికి అంగీకరించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 41 లక్షల స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు విద్యుత్ బోర్డు నిర్ణయం చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు వల్ల పగటిపూట ఒక రేటు, రాత్రిపూట మరొక రేటు విద్యుత్ చార్జీలను వసూలు చేస్తారని చెప్పారు. స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చు వినియోగదారుల నుంచి ఒకొక్క మీటరుకు రూ.10,550 వసూలు చేస్తారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అడ్డుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలువుతామని చెప్పారు.

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్ర, ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. సచివాలయం పరిధిలో 70 మందికి యోగాంధ్రపై శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 7వ తేదీ, 14వ తేదీన యోగాంధ్రపై అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 6న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల వద్ద ప్రభుత్వ కార్యాలయం దగ్గర మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమాలను సర్పంచ్, ఎంపిటిసిలు, గ్రామ పెద్దల సమక్షంలో చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జె. రాములమ్మ, ఎంఇఒ, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వంగర



సచివాలయానికి చేరుకున్న విత్తనాలు

మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలు అందించినట్లు మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు బుధవారం తెలిపారు. ఈ నెల ఒకటిన ప్రజాశక్తిలో వరి విత్తనాలు ఎప్పుడు వస్తాయో..? అన్న కథనానికి అధికారులు స్పందించి వివిధ గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు 591 క్వింటాల వరి విత్తనాలు అందించినట్లు ఆయన వెల్లడించారు. యంటియు 1064, స్వర్ణ, సోనామసూరు, యంటియు 1121, ఆర్జిల శ్రీకాకుళం సన్నాలు, యంటియు 1318 రకాలు విత్తనాలు వచ్చాయన్నారు. వీటిని త్వరలోనే రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎప్పుడు పంపిణీ చేస్తామనే విషయాన్ని రైతులకు అతి త్వరలోనే తెలియజేస్తామన్నారు. రైతులు ఎక్కువగా సంపద విత్తనాలు అడుగుతున్నారని ఎఒ కన్నబాబుని ప్రజాశక్తి వివరణ కోరగా సంపద విత్తనాలు ప్రభుత్వం నుంచి సరఫరా లేదన్నారు

నవధాన్యాలతో భూసారం పెంపు

ప్రజాశక్తి- గంట్యాడ

నవధాన్యాలు పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం వసాది యూనిట్ ఇంఛార్జి కొప్పాక లక్ష్మీ అన్నారు. బుధవారం సిరిపురం, లక్కిడాం, వసాది గ్రామాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ తమకు ఉన్న భూమిలో పచ్చి రొట్ట విత్తనాలు వేయడం వల్ల భూసారంతో పాటు నత్రజనిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగ పడతాయని అన్నారు. ఖర్చు తగ్గుతుందని పంట దిగుబడి పెరుగుతుందని దీని వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు హేమ, నిహారిక, పద్మ, ఎస్.సునీత రైతులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరంలో రెండు రోజులు మంచినీటి సరఫరాకు అంతరయం ఏర్పడుతుందని పంచాయతీ కార్యనిర్వాహణాధికారి జి.జనార్ధనరావు బుధవారం ప్రజాశక్తికి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పట్టణంలో బూర్లివీధికి సంబంధించి ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురవడంతో బుధవారం పనులు చేసినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాకు అవకాశం లేకపోవడంతో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో యోగాంధ్ర

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్రలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆయుష్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో యోగా గురువు సుభాకర్ రాజు విద్యార్థులకు, పెద్దలకు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రణాయము, ధ్యానం మొదలగు వాటిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

కొత్తవలస: ఈ నెల 21తేదీనా అంతర్జాతీయ యోగాడేని పురస్కరించుకొని బుధవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంపిడిఒ సంజీవ రమణయ్య ఆధ్వర్యంలో మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం జెడ్‌పి హైస్కూల్ నుంచి కొత్తవలస జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తవలసలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి యోగా విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము, టిడిపి నాయకులు కోళ్ల శ్రీను, రత్నాజీ, ఇఒపిఆర్‌డి శ్రీదేవి, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో వెన్నుపోటు

◆ కూటమి సర్కారుపై మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆగ్రహం ◆ జిల్లా వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల్లో టిడిపి కూటమి అబద్ధపు హామీలిచ్చి.. ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి ఆధ్వర్యాన వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని సిఎంఆర్ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు వైసిపి శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టాయి. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ర్యాలీలో పాల్గొన్న కోలగట్ల మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇదే చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలను ప్రకటించి గద్దెనెక్కారని, 2019 ఎన్నికల్లో ప్రజలు గద్దె దించారన్నారు. గతంలో చేసిన పొరపాట్లు మరల చేయనని ఉద్దేశంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే, మళ్లీ పాత తరహాలో కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికలకు ముందు వాలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేసిన వాహనాలను రద్దు చేశారని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని చెప్పారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని, మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. తల్లికి వందనం ఇస్తామని పంగనామం పెట్టి... నాన్నకు ఇంధనం మాత్రం అందులోనే ఉంచారని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బొద్దాన అప్పారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు గదుల సత్యలత, వైసిపి మండల అధ్యక్షులు కెల్ల త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసనలను చేపట్టారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుంచి తహశీల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ బి రత్నకుమార్‌కు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, నాయకులు, కార్యకర్తలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది అవుతున్న ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, మండల నాయకులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, జగదీష్, పప్పల గురునాయుడు, సర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: పేద ప్రజలకు మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచిన సందర్భంగా నిరసిస్తూ వెన్నుపోటు దినాన్ని నిర్వహించామని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆకుల డిపో నుండి దేవి కూడలి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతల సర్పంచ్ అప్పన సుబ్రమణ్యం, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో బుధవారం వెన్నుపోటు దినం ర్యాలీ చేసి నిరసన తెలిపారు. వైసిపి కార్యాలయం నుంచి స్టేట్ బ్యాంక్, కృష్ణ టాకీస్, బలిజిపేట రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అధికారం కోసం అబద్ధాలాడి ప్రజలను మోసం చేసిన ఈ పాలకులను ప్రజలు నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4 మండలాల వైసిపి శ్రేణుల ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఆఫీస్ నుంచి జాతీయ రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణ, పిన్నింటి తమ్మినాయుడు, గదల సన్యాసినాయుడు, చిట్యాల సాంబ, పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎంపిపిలు మహంతి కళ్యాణి, అంబళ్ల సుధారాణి, అంబళ్ల శ్రీరాములనాయుడు, మహంతి శ్రీనివాసరావు జనార్దన్ రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: వైసిపి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చంనాయుడు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాలు అధ్యక్షులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: ర్యాలీ చేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు



గజపతినగరంరూరల్: ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స, తదితరులు

శుభ పరిపాలనకు ఏడాది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అరాచక పాలనకు ముగింపు వచ్చి సుభపరిపాలన ప్రారంభమై ఏడాది పూర్తైన సందర్భంగా, రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వం గురించి హర్షం వ్యక్తం చేస్తూ కొనియాడుతున్నారని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. బుధవారం జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నగర పంచాయతీలో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సభలో ఆమె మాట్లాడుతూ 'ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం మంచి పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తుందన్నారు. నియోజకవర్గానికి నిధులు, అభివృద్ధి పనులు తీసుకువచ్చేందుకు తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకం ప్రసాద్, నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, చనమల్ల వెంకటరమణ, బంటుపల్లి వాసు దేవరావు, పతివాడ అచ్చంనాయిడు, తుమ్మి లక్ష్మీరాజ్, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

జనసేన ఆధ్వర్యంలో సంబరాలు

గజపతినగరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది గడిచిన సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు మేరకు గజపతినగరంలో జనసేన పిఎసి సభ్యురాలు పడాల అరుణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల అరుణ మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో తమ అధినేత ఆదేశాల మేరకు సంక్రాంతి సంబరాలు తలపించే విధంగా సంబరాలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశామన్నారు. గజపతినగరం ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు జనసేన మండల పార్టీ అధ్యక్షులు మునకాల జగన్నాథరావు, రైతు నీటి వినియోగదారుల సంఘం కమిటీ డైరెక్టర్ తాళ్లపూడి సావిత్రి త్రివేది, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

భోగాపురం: అరాచక పాలనకు తెరపడుతూ రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమై ఏడాది అయిన సందర్భంగా భోగాపురం పార్టీ కార్యాలయంలో జనసేన ఆధ్వర్యంలో ఘనంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంవత్సరంలో కూటమి ప్రభుత్వం చేసిన సేవలను, నెరవేర్చిన అభివృద్ధి కార్యక్రమాలను మీ అందరితో పంచుకోవడం గర్వంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పక్కా రోడ్లు, తాగునీటి పథకాలు, వైద్య సదుపాయాలు, మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు మొదలైనవన్నీ వేగంగా అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బూర్లె శ్రీధర్, జనసేన నాయకులు కోట్ల రఘు, మట్టా అయ్యప్ప రెడ్డి, బాల అప్పలరాజు, తుమ్మి లక్ష్మీ రాజ్, బి వాసుదేవరావు, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, బల రాంబాబు, వందనాల రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజాంలో అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 5న అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐటిఐ పాస్ అయిన ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసిన అభ్యర్థులు, రెండువ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 18 నుండి 20 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులకు ఈ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మేధా సెర్వో కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ గురువారం ఈ మేళా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎండిఎం కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి- తెర్లాం

మధ్యాహ్న భోజన కార్మికులకపై వేధింపులు తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం భోజన కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూళ్లు జూన్ 12 నుండి తెరవబడుతున్న నేపథ్యంలో ఎండిఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. వారికి కనీస వేతనం రూ.10వేలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేడివేడి పదార్థాలు వంటచేసి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. రూ.3వేలు జీతం, అరకొర మెనూ చార్జీలతో పోషకాహార భోజనం ఎలా పెడతారని ప్రశ్నించారు. ఒకపక్క ధరలు విపరీతంగా పెరుగుతున్నా పిల్లలకి ఇచ్చే మెనూ చార్జీ అత్యంత స్వల్పంగా ఉందన్నారు. కనీసం పిల్లాడికి 20 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని యూనిఫారాలు ఇవ్వాలని, రాజకీయ తొలగింపులు వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం కార్మికులకు బడ్జెట్ పెంచాలని వాళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చంద్రావతి అన్ని స్కూల్లో కార్మికులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికులతో సమావేశం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులతో బుధవారం ఎంఇఒ త్రినాధరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.రాంబాబు హాజరై మాట్లాడారు. జూన్ 12వ తారీకు నుండి స్కూళు ప్రారంభమవుతాయి కాబట్టి భోజన పథక కార్మికులు పనిచేస్తున్న స్కూళ్లలో విద్యార్థులకు రుచికరంగా భోజన పదార్థాలు వండి అందించాలని సూచించారు. మెనూ ప్రకారం వంటలు చేయాలని, విద్యార్థులను మీ సొంత పిల్లలులా చూసుకోవాలని మంచిగా పౌష్టికాహారం అందించాలని కోరారు. ఎంఇఒ త్రినాధరావు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఈ మండలంలో పనిచేస్తూ ప్రతి స్కూలును తనిఖీ చేస్తున్నానని ఎవరు ఎలా పనిచేస్తున్నారో తమకు తెలుసు కాబట్టి ఈ అకడమిక్ ఇయర్లో కూడా అందరూ శుభ్రంగా వంటలు చేసి పిల్లలకి అందించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ-2 పాపారావు, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు రమేష్, మధ్యాహ్న భోజన పథక కార్మికులు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికులకు శిక్షణ

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంఇఒ ఎంవి ప్రసాద్ రావు అధ్యక్షతన ఎంఇఒ -2 బొత్స ఎరకయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల ఎండిఎం కార్మికులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ శ్యామల కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, వేడి ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిణామాలను అనుసరించి పిల్లలకు రుచికరమైన భోజనం శుచి శుభ్రత పాటించి పాఠశాల ఆవరణలో పిల్లలకు భోజనం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అకౌంటెంట్ కర్ర సూర్యారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పొన్నాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు 54,622 మంది

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ కోసం బొబ్బిలి సబ్ డివిజన్‌లో 54,622 మంది రైతులు భూములు ఖాతాలకు ఆధార్ లింక్ చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడి మజ్జి శ్యామసుందర్ చెప్పారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి సబ్ డివిజన్‌లో 73,927 మంది రైతులు భూమి ఖాతాలు ఉండగా ఇప్పటి వరకు 54,622 ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేశామని చెప్పారు. బొబ్బిలి మండలంలో 23,092మంది రైతులలో 17,089మంది రైతులకు ఆధార్ అనుసంధానం చేశామని, తహశీల్దార్ లాగిన్‌లో 2705 పెండింగులో ఉన్నాయని, 4342 రిజెక్ట్ అయ్యాయన్నారు. బాడంగి మండలంలో 15,197మంది రైతులకు 10,961 మందికి ఆధార్ అనుసంధానం అయిందని, తహశీల్దార్ లాగిన్‌లో 3009 పెండింగులో ఉన్నాయని, 1227 రిజెక్ట్ అయ్యాయని చెప్పారు. తెర్లాం మండలంలో 18,792మంది రైతులలో 14,556 మందికి ఆధార్ అనుసంధానం అయిందని, తహశీల్దార్ లాగిన్‌లో 249 పెండింగ్‌లో ఉండగా 3983 రిజెక్ట్ అయ్యాయని చెప్పారు. రామభద్ర పురం మండలంలో 16,846మంది రైతులలో 12,016 మందికి ఆధార్ అనుసంధానం అవ్వగా తహశీల్దార్ లాగిన్‌లో 3138 ఉండగా 1752 రిజెక్ట్ అయ్యాయని చెప్పారు. భూమి ఖాతాలకు, ఆధార్‌లో ఉన్న పేర్లు సరిపోకపోయినా, తప్పుడు ఆధార్ లింక్, తప్పుడు ఖాతా, మ్యూటేషన్ చేయని భూముల ఆధార్ లింక్ రిజెక్ట్ అయ్యాయని చెప్పారు. అన్నదాత సుఖీభవ అర్హులు జాబితాను ఆర్‌టిజిఎస్ ప్రకటిస్తుందని చెప్పారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - రామభద్రపురం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు సూచించారు. మండల పరిధిలోని శిష్టు సీతారాంపురం గ్రామంలో బుధవారం సంకల్పం కార్యక్రమంపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఒటిపిలు చెప్పరాదని, బ్యాంకు అధికారుల పేర్లు చెప్పి ఫోను చేసి బ్యాంకు ఖాతానెంబర్లు అడుగుతున్నారని అటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మహిళలపై దాడుల విషయంలో కూడా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అమ్మాయిలను వేధించిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, దీని వల్ల ప్రమాదాలు జరిగితే కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లు తుందని, రోడ్డు ప్రమాదాల నివారణ పై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై యువత దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా కేసులు తప్పవని హెచ్చరించారు.

కౌలు రైతులకు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

కౌలు రైతులందరికీ కౌలు కార్డులివ్వాలని కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు 2019 చట్టాన్ని రద్దుచేసి భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా గ్రామ సభ ద్వారా కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు చంద్రబాబు ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని కోరారు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసిందని దీంతో చాలామంది కౌలు రైతులు అర్హత ఉన్నప్పటికీ కౌలు భూము చేయడానికి ఎటువంటి రాయితీలు, పొందకపోగా చాలామందికి కౌలు సొమ్ము అందలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2011 మాదిరిగా భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇప్పించాలని కోరారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా వారికి కనీసం నష్టపరిహారం కూడా అందడంలేదని అన్నారు. ఈనెల 11వ తేదీ లోపు సమస్యలను పరిష్కరిం చకపోతే చలో విజయ వాడకు పిలుపునిచ్చామని కమిషనర్ కార్యాలయాన్ని ముట్ట డిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తహశీల్దార్ బి.రత్నకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పంటలు అప్పలనాయుడు, ధనాను మారయ్య, వి.సత్యానా రాయణ, బొండా వెంకట రమణ, వి.సన్యాసి రావు, ఆకిరి కళావతి, ఆకిరి సత్యానా రాయణ తదితరులు పాల్గొన్నారు.